అంగన్వాడీ కార్యకర్త మృతి

ప్రజాశక్తి-పాడేరు: చింతపల్లి మండలం గొందిపాకల పంచాయతీ చిత్రాలగొప్పు గ్రామానికి చెందిన అంగన్వాడీ వర్కర్ గెమ్మెలి భూదేవి(46) అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందారు. తీవ్ర అస్వస్థతకు గురైన భూదేవిని ఆమె బంధువులు, కుటుంబీకులు శనివారం రాత్రి విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. ఆమె 23 సంవత్సరాలుగా అంగన్వాడి కార్యకర్తగా పని చేశారు. ప్రభుత్వం స్పందించి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బోనంగి చిన్నయ్య పడాల్, వి ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూదేవి అకాల మరణంతో ఆమె కుటుంబానికి తీరని లోటు ఏర్పడిందని, ప్రభుత్వం అన్ని విధాలా ఆమె కుటుంబాన్ని ఆదుకోవాలని, తగిన ఆర్థిక సాయం అందించాలని వారు డిమాండ్ చేశారు. భూదేవి అకాల మరణం పట్ల అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టగుల్లి భాగ్యలక్ష్మి కుటుంబానికి తమ సానుభూతిని తెలియజేశారు. పలువురు అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు, బంధువులు తమ సంతాపం వెలిబుచ్చారు.

వేతనాలకు వెతలు

-కుటుంబాలు గడవక పారిశుధ్య కార్మికుల అవస్థలు
-నేడు నిరసనలకు సిద్ధం

పాడేరులో ఆందోళన చేపడుతున్న పారిశుధ్య కార్మికులు (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి-పాడేరు: గ్రామ పంచాయతీల్లోనూ, సచివాలయాల్లోనూ పారిశుధ్య పనులు నిర్వర్తిస్తున్న కార్మికులు గత కొన్నేళ్లుగా వేతనాల వెతలను ఎదుర్కొంటున్నారు. ఈ మేరకు గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పారిశుధ్య కార్మికులు తమ వేతన బకాయిల కోసం పోరు సాగిస్తున్నారు. ఈ మేరకు ఈనెల 21న అల్లూరి జిల్లా కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. వేతనాల కోసం సాగిస్తున్న తమ పోరులో భాగంగా ఈనెల 28న సోమవారం అన్ని మండల కేంద్రాల్లో ఎంపీడీవో కార్యాలయాలు వద్ద నిరసన కార్యక్రమాలకు పారిశుధ్య కార్మికులు సిద్ధమయ్యారు

అల్లూరి జిల్లాలోని సచివాలయాల్లో పని చేస్తున్న 930 మంది గ్రీన్ అంబాసిడర్లు, పంచాయితీల్లో పని చేస్తున్న సుమారు 500 మంది పారిశుధ్య కార్మికులు గత కొన్నేళ్లుగా వేతనాల వెతలను ఎదుర్కొంటున్నారు. వీరికి ప్రతినెలా వేతనాలు సక్రమంగా అందకపోవడం సకాలంలో చెల్లింపులు జరగకపోవడంతో కుటుంబాలు గడవక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో, తమ వేతన బకాయిల కోసం పారిశుధ్య కార్మికులు ఆందోళన చేపట్టవలసిన పరిస్థితి ఎదురైంది. ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు అందలేదు. పారిశుధ్య కార్మికులకు యూనిఫాం, బూట్లు, సేఫ్టీ మెటీరియల్ వంటి సామగ్రిని ప్రభుత్వం సరఫరా చేయలేదు. వీరికి పీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలు లేవు. వృద్ధాప్యంతో చనిపోతున్న పారిశుధ్య కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వపరంగా ఎటువంటి సాయం అందలేదు. పారిశుధ్య కార్మికులను వేధింపులకు గురి చేసే టెండర్ విధానం మాత్రం పక్కాగా అమలు చేస్తున్నారు. టెండర్ విధానాన్ని రద్దు చేయాలని వేతన బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 28న పోరాటం చేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘం నేతలు కోరారు.

చాలీచాలని వేతనాలు

ప్రతిరోజు పనులు ఉంటున్నాం. తమకు సక్రమంగా వేతనాలు అందక అవస్థలు పడుతున్నాం. చాలీచాలని వేతనాలతో బతుకులీడిస్తున్న తమకు వేతనాల చెల్లింపుల్లో ప్రభుత్వం పట్టించుకోలేదు. వేతన బకాయిలను చెల్లించాలని కోరుతున్నాం. జగన్ ప్రభుత్వం వస్తే తమకు ఉద్యోగ భద్రత లభిస్తుందని కనీస వేతనాలు అందుతాయని ఆశించిన తమకు నాలుగేళ్లయినా నిరాశే మిగిలింది.

ఎస్ జీనబంధు..
జిల్లా కన్వీనర్, ఏపీ గ్రామపంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్

తాగునీటికి గిరిజనుల ఇక్కట్లు

-ముందుకు సాగని తాగునీటి పథకం పనులు

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని పట్టం పంచాయతీ బురువలస గ్రామంలో తాగునీటి సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మూడు నెలల క్రితం తాగునీటి పథకం మంజూరైంది. ఈ పనులు నత్తనడకన సాగుతున్నాయి. తాగునీటి పథకానికి సంబంధించి పైపులు వేసి, వీధి కుళాయిలకు సంబంధించిన కుండీలు, డ్రమ్ముల నిరుపయోగంగా వదిలేశారు. బురు వలస గ్రామంలో 250 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. తాగునీటి సౌకర్యం లేక పోవడంతో ఊట నీటినే సేకరిస్తున్నారు. వర్షాలు పడుతుండటంతో ఆ నీరు కలుషితమై గిరిజనులు రోగాల బారిన పడుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపంతో పనులు పూర్తిస్థాయిలో చేపట్టకుండా తమకు నచ్చినట్టుగా కాంట్రాక్టు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. తాగునీటి సౌకర్యం కల్పించాలని గ్రామ ప్రజలు పలు మార్లు కాంట్రాక్టర్‌ను కోరినా కాలయాపన చేస్తున్నారని వారు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని బూరువలస గ్రామంలో నెలకొన్న తాగునీటి సౌకర్యం కల్పించాలని గ్రామ ప్రజలు కోరారు.లేనిపక్షంలో ఐటీడీఏ వద్ద ఆందోళన చేపడతామన్నారు.

నిరుపయోగంగా ఉన్న ట్యాంకు, కుండీలు

ప్రజావ్యతిరేక పాలనపై ఐక్య పోరాటం

సిఐటియు జిల్లా అధ్యక్షులు చిన్నయ్యపడాల్

సమావేశంలో మాట్లాడుతున్న చిన్నయ్యపడాల్

ప్రజాశక్తి -సీలేరు: బలమైన కార్మిక ఐక్య పోరాటాల ద్వారానే ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న పాలక ప్రభుత్వాలను గద్దె దించగలమని. సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ అన్నారు. ఆదివారం సిఐటియు కార్యాలయంలో విష్ణుకుమార్ రాజు అధ్యక్షతన జరిగిన అప్పర్ సీలేరు జెన్‌కో కాంట్రాక్టు కార్మికుల ప్రాంతీయ కమిటీ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ నరేంద్ర మోడీ తొమ్మిదేళ్ల పాలనలో అటు ప్రజలకు, ఇటు కార్మిక వర్గానికి తీవ్ర ద్రోహం జరిగిందని మండపడ్డారు. పోరాడి సాధించుకున్న 44 రకాల కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్‌గా కుదించి, కార్మికులను యాజమాన్యాలకు బానిసలను చేశారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా క్రమబద్ధీకరించాలని దశబ్దాలుగా పోరాటాలు చేస్తుంటే, ఏకంగా ప్రభుత్వ రంగ సంస్థలనే నరేంద్ర మోడీ చంపేస్తున్నాడని విమర్శించారు. ప్రభుత్వ విధానాలపై కార్మికులు, కష్టజీవులు, ప్రజలు కలిసికట్టుగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు దుమ్ముగూడెం నాయకులు బి వి రమణ. యూనియన్ మాజీ గౌరవ అధ్యక్షులు సిఐటియు నాయకులు ఎస్‌కె శుభాన్, వరహాలు, లక్ష్మణ్. సిఐటియు జికె.వీధి మండల కార్యదర్శి గడుతూరి సత్యనారాయణ, గాలకొండ ఎంపిటిసి. ఆపురంగి బుజ్జిబాబు, కార్మికులు పాల్గొన్నారు.

రెండో విడత డిగ్రీ ప్రవేశాలకు
1లోగా దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-చింతూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండో దశ డిగ్రీ ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రత్నమణిక్యం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 28 నుంచి వచ్చేనెల ఒకటో తేదీలోగా రెండోదశ అడ్మిషన్ల దరఖాస్తులు స్వీకరిస్తామని వివరించారు. తమ కళాశాలలో బిఎ ఆనర్స్ పొలిటికల్ సైన్స్, బిఎ ఆనర్స్ ఎకనామిక్స్ కోర్సు ఉందన్నారు. అలాగే బీకాం ఆనర్స్ జనరల్ మైనర్ కంప్యూటర్ అప్లికేషన్స్, బిఎస్‌సి ఆనర్స్ కంప్యూటర్ సైన్స్, బిఎస్‌సి ఆనర్స్ జంతు శాస్త్రం, బిఎస్‌సి ఆనర్స్ రసాయన శాస్త్రం డిగ్రీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మొదటి ఫేజ్‌లో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు తరగతులు ప్రారంభమైనట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే జగనన్న విద్యాదీవెన, జగనన్న వస దీవెన తమ విద్యార్థులకు అందిస్తామన్నారు. డిగ్రీ కోర్సుల విద్యా బోధనతోపాటు ప్రభుత్వ ఉద్యోగాలు పొందేందుకు అవసరమైన శిక్షణ అందిస్తామని ప్రిన్సిపల్ తెలిపారు.

44 వేల ఎకరాల్లో కాఫీ ప్లాంటేషన్ పనులు

-కాఫీ, మిరియాలు, నీడనిచ్చే మొక్కలు పెంపకం
-ప్రజాశక్తితో కాఫీ అసిస్టెంట్ డైరెక్టర్, ప్రాజెక్ట్ ఉద్యాన అధికారి అశోక్

ప్రజాశక్తి-పాడేరు: **పాడేరు ఏజెన్సీ 11 మండలాల పరిధిలో ఉన్న కాఫీ తోటల్లో గిరిజన రైతుల ద్వారా చేపట్టిన మొక్కలు నాటే పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని ఐటీడీఏ కాఫీ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రాజెక్ట్ ఉద్యాన అధికారి(పీహెచ్ఓ) టి. అశోక్ వెల్లడించారు. పాడేరు ఏజెన్సీ వ్యాప్తంగా ఐటిడిఏ ద్వారా కాఫీ తోటల్లో నిర్వహిస్తున్న ప్లాంటేషన్ పనులకు సంబంధించిన వివరాలపై తెలిపిన సమాచారం ఆయన మాటల్లోనే..**

ఏజెన్సీలో కాఫీ ప్లాంటేషన్ పనులు?

పాడేరు ఏజెన్సీలోని సుమారు 2000 గ్రామాల్లో 20 వేల మంది గిరిజన రైతుల 44 వేల ఎకరాల కాఫీ తోటల్లో ఈ ఏడాది ప్లాంటేషన్ పనులు నిర్వహిస్తున్నారు. 16 వేల ఎకరాల్లో కొత్తగా ఈ ఏడాది కాఫీ ప్లాంటేషన్ చేస్తున్నారు. మరో 12,999 ఎకరాల కాఫీ తోటల్లో గ్యాప్ ఫిల్లింగ్ కింద కాఫీ మొక్కలు నాటుతుండగా మరో 15 వేల ఎకరాల పాత కాఫీ తోటలను పునరుద్ధరించేందుకు కాఫీ మొక్కల ప్లాంటేషన్ చేస్తున్నాం.

కాఫీ తోటల్లో నీడనిచ్చే మొక్కలు

ఈ కాఫీ తోటల్లో మిశ్రమ నీడనిచ్చే మొక్కల పెంపకం కింద ఎకరానికి 10 చొప్పున కొండమామిడి, నేరేడు, పనస, సంపెంగ, మరియు మిరియాల మొక్కల నాటి రైతులు నిర్వహిస్తున్నారు.

మిరియాలు, కాఫీ మొక్కల పంపిణీ?

ఈ ఏడాది కొత్తగా కాఫీ మొక్కలు నాటుతున్న గిరిజన రైతులకు ఎకరానికి 50 చొప్పున మిరియాల మొక్కలు చింతపల్లి హెచ్ఎన్ టిసి నుంచి ఉచితంగా పంపిణీ చేశాం. అలాగే 2 కోట్ల కాఫీ మొక్కలను కాఫీ రైతులకు పంపిణీ చేశాం. ఈ నెలాఖరు నాటికి కాఫీ తోటల్లో ప్లాంటేషన్ పనులు పూర్తి చేయనున్నాం..

గిట్టుబాటు ధర కల్పనకు చర్యలు

ఏజెన్సీలో గిరిజన రైతులు అత్యధికంగా దిగుబడి చేస్తున్న కాఫీకి గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. ముఖ్యంగా గిరిజన రైతులు దిగుబడి చేసే కాఫీ గింజల నాణ్యతను పెంచేందుకు ప్రాధాన్యత ఇస్తున్నాం.

ఎకో కాఫీ పల్పింగ్ యూనిట్ల ఏర్పాట్లు

ప్రస్తుతం ఒక చింతపల్లి మండల కేంద్రంలో మాత్రమే ఉన్న ఎకో కాఫీ పల్పింగ్ యూనిట్ ను ఐటీడీఏ ద్వారా మరో ఏడు కోట్లు వెచ్చించి చింతపల్లి, జికె వీధి మండలాల్లో కూడా అందుబాటులోకి తెస్తున్నాం. వీటి ద్వారా కొయ్యూరు, జికె వీధి, చింతపల్లి, జి.మాడుగుల, పాడేరు, హుకుంపేట మండలాల్లో కాఫీ రైతులకు ప్రయోజనం చేకూరుతుంది.



కాఫీ తోటల పెంపకంపై శ్రద్ధ

గిరిజన రైతులు దిగుబడి చేసే కాఫీని నాణ్యమైన పార్చ్మెంట్ కాఫీగా మార్కెట్కు ఎగుమతి చేస్తే మంచి ధర లభించేందుకు అవకాశం కలుగుతుంది. దీనివల్ల గిరిజన రైతులు ఎంతో లాభం ఆదాయం చేకూరనుంది. కాఫీ తోటల పెంపకం పై గిరిజన రైతులు ఏడాది పొడుగునా నిర్వహించే నిర్వహణ పనుల పై మరింత శ్రద్ధ తీసుకునే విధంగా కృషి చేస్తున్నాం. దీంతో కాఫీ దిగుబడి మరింత పెరిగి రైతుల కష్టానికి తగిన ప్రతిఫలం పెరుగుతుంది. ఈ నేపథ్యంలోనే పెంపకంపై శ్రద్ధ చూపుతున్నాం.

ఫ్రూట్స్ అందజేస్తున్న సిపిఎం నాయకులు

మొర్రిగుడలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: గసభ పంచాయతీ మొర్రిగుడ గ్రామంలో ప్రత్యేక వైద్య నిపుణులతో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని సిపిఎం మండల కమిటీ డిమాండ్ చేసింది. డయేరియాతో అరకువేలి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పాంగి కొత్తును పరామర్శించిన సిపిఎం మండల కార్యదర్శి ఎస్బీ. పోతురాజు, ఆ పంచాయతీ మాజీ సర్పంచ్ పాంగి సురేష్ కుమార్, వార్డుమెంబర్ పి.సత్యనారాయణ పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొర్రిగుడలో తక్షణమే ఆర్వో ప్లాంట్ ద్వారా సురక్షిత తాగు నీరు అందించాలని డిమాండ్ చేశారు. ఆ గ్రామంలో సుమారు 220 కుటుంబాలు 1200మంది జనాభా ఉండగా గెడ్డలో కలుషిత నీరు తాగడంతో ప్రతి ఏటా మలేరియా, డయోరియా, వాంతులు, విరేచనాలతో మృతి చెందుతున్నారాన్నారు. గత ఏడాది డయోరియాతో 6గురు మృతి చెందగా వంద మందికి పైగా అరకువేలి ఏరియా ఆసుపత్రిలో సర్పంచ్ చొరవతో చికిత్స పొంది కోలుకున్నారన్నారన్నారు.

సంబరాలు చేస్తున్న గ్రామస్తులు, కుటుంబీకులు

అంతర్జాతీయ క్రికెటర్ రవణి ఇంట సంబరాలు

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని మెరిక చింత పంచాయతీ రంగసింగపాడు గ్రామానికి చెందిన అంతర్జాతీయ క్రికెట్ పోటీల్లో సత్తా చాటిన వలసనైని రవణి ఇంట సందడి నెలకొంది.బాలకృష్ణ, చిట్టమ్మ దంపతులకు ఐదుగురు సంతానం. రెండవ కుమార్తె రవణి అంధురాలు. ఈమె చిన్నతనం నుంచి క్రీడా రంగంలో మక్కువ చూపించడంతో తల్లిదండ్రులు ప్రోత్సహించారు. అంతర్జాతీయ క్రికెట్లో ఆస్ట్రేలియా పై భారత్ ఘన విజయం సాధించడంలో కీలకపాత్ర పోషించిన రవణి గెలుపుకు కారణమైంది.దీంతో, పలువురు ఆమెను అభినందించి ప్రశంసించారు. స్వగ్రామంలో ఆమె ఇంట అంగరంగ వైభవంగా సంబరాలు చేశారు. మిఠాయిలు ఒకరికొకరు తినిపించు కున్నారు. ఆదివారం మండలంలో పలువురు నాయకులు, సర్పంచులు, మండల పరిషత్ వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు, బాకూరు ఎంపీటీసీ నైని సత్తిబాబు, మెరకచింత సర్పంచ్ దూసూరు వెంకటరావు, మెరకచింత మాజీ సర్పంచ్, సీపీఎం మండల కార్యదర్శి వలసనైని లక్ష్మణరావు, రాప సర్పంచ్ కొప్పుల లక్ష్మయ్య, మత్స్య పురం సర్పంచ్ పూజారి సుబ్బారావు గన్నేరు పుట్టు మాజీ సర్పంచ్, గిరిజన మహిళ సంఘం హుకుంపేట మండల అధ్యక్షురాలు సూడిపల్లి లక్ష్మీ ప్రమీల, గ్రామ వాలంటీర్ వలసనైని సింహచలం, వార్డు మెంబర్ సింహచలం, మజ్జి కొండలరావు, మజ్జి సింహచలంలు ఆమె ఇంట సంబరాలు చేశారు.

నడవాలంటే నానాయాతన!

- దమ్ము పొలాలను తలపిస్తున్న రహదారులు
- అడుగు తీసి వేయలేని స్థితిలో గ్రామీణ రోడ్లు
- పదేళ్లుగా ఇదే దుస్థితి.. పట్టించునే దిక్కే లేదు...
- అవస్థలు పడుతున్న మండల కేంద్రవాసులు

ప్రజాశక్తి-చింతూరు: మండల కేంద్రమైన చింతూరులో అంతర్గత రహదారులు అధ్వానస్థితిలో ఉన్నాయి. చింతూరులోని గొల్ల బజారు, బిసి కాలనీ, ఎస్‌సి కాలనీ రోడ్లపై నడవాలంటే నరకయాతనే. 2014లో రాష్ట్ర విభజన తర్వాత ఈ రోడ్ల దుస్థితిని పట్టించుకునే వారే లేకుండా పోయారు. ఫలితంగా మండల కేంద్రంలో అనేక కాలనీలు, వీధులకు వెళ్లే అంతర్గత రోడ్లన్నీ దైన్యస్థితికి చేరుకున్నాయి. రోడ్లపై పెద్దగోతులేర్పడి, ఇటీవల కురుస్తున్న వర్షాలకు వాటిల్లో నీరు నిండిపోవడంతో దమ్ము పొలాలను తలపిస్తున్నాయి. ఏటా వర్షాల సీజన్‌లో వరదల ముంపు భయంతో ఇబ్బందులు పడే చింతూరు వాసులు, ఈ ఏడాది వరదముంపు బెడద లేదని ఊపిరిపీల్చుకునే పరిస్థితి లేకుండా, ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్లపై ఉన్నభారీ గోతుల్లో నీరు చేసి, చెరువులను తలపిస్తుండడంతో ఆయా చెరువుల్లోనే దిగి నడిచి వెళుతున్న భావన కలుగుతోందని చింతూరు వాసులు ఆవేదన చెందుతున్నారు. కాలినడకన వెళ్లాలంటేనే ఆయా కాలనీలకు వెళ్లలేని పరిస్థితి ఉందంటే, ఆయా కాలనీలకు బైక్‌లు, ఇతరత్రా వాహనాలు వెళ్లడం మానేశాయంటే అతిశయోక్తి కాదని అంటున్నారు.

రోడ్ల దుస్థితిపై అధికారులు, నేతలకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా స్పందించే దిక్కు లేదని చింతూరు ప్రజల వాపోతున్నారు. విభజన తర్వాత, టిడిపి, వైసిపి రెండు ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చినా ఏ ఒక్కరూ తమ గోడును పట్టించుకునే పరిస్థితి లేదంటున్నారు.ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను రెండు ప్రభుత్వాలు పట్టించుకోలేదని, దీంతో వరదముంపు బెడద తప్పిందన్న సంతోషం లేకుండా గోతుల రోడ్లపై అవస్థలు పడుతున్నామని ఆందోళన చెందుతున్నారు ఐటిడిఎ కార్యాలయంతోపాటు అన్ని మండల కార్యాలయాలు ఉన్న మండల కేంద్రంలోనే రోడ్ల దుస్థితి ఇంత అధ్వానంగా ఉంటే మారుమూల గ్రామాల్లో పరిస్థితి ఇంకెంత దారుణంగా ఉంటుందో ఊహించుకోవడం కష్టమని అంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, స్థానిక నేతలతోపాటు అధికారులు స్పందించి, మండల కేంద్రంలోని ఎస్‌సి, ఎస్‌టి, బిసి కాలనీల రహదారులను బాగుచేయించి నడిచి వెళ్లేందుకు యోగ్యంగా మార్చాలని చింతూరు వాసులు కోరుతున్నారు.

దమ్ము పొలాన్ని తలపిస్తున్న చింతూరులోని వీధి రోడ్డు

హామీలే మిగిలాయి...

ఎన్నికల వేళ రోడ్లు వేస్తాం, ఇతర సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన నేతలు కనిపించడం లేదు. నడిచి వెళ్లేందుకు కూడా వీలు లేనంతగా రోడ్లు పాడయ్యాయి. ఆసుపత్రికి, ఇతరత్రా అత్యవసర పరిస్థితుల్లో ఆటోలు, ఇతర వాహనాలు వచ్చే పరిస్థితి లేదు. అధికారులు, నేతలు కళ్లు తెరిచి మా కష్టాలు చూడండి. రోడ్లు బాగుచేయండి.

కురసం రాములమ్మ. చింతూరు ఎస్‌టికాలనీ.

చీకటి పడితే వెళ్లడం కష్టమే

పదేళ్లుగా కాలని రోడ్లను పట్టించుకోవడం మానేశారు. పూర్తిగా గోతులమయమై, ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో నీటి కుంటలను తలపిస్తున్నాయి. ఎక్కడ ఎంతలోతు గొయ్యి ఉందో తెలియని స్థితి. చీకటిపడితే ఆయా వీధుల్లోకి వెళ్లలేని పరిస్థితి ఉంది. నిధులొస్తున్నాయన్న హామీలే తప్ప, పనులు జరగడం లేదు.

రాము, టైలర్, గొల్లబజార్.

యువత ఔదార్యం

నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న యువత

ప్రజాశక్తి-కూనవరం : మండలంలోని అయ్యావారిగూడెం గ్రామంలోని యువత ఔదార్యాన్ని చాటుకున్నారు. గ్రామంలో ఇరకం వెంకయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించగా, పెద్దదిక్కు మరణంతో పూటగడవని స్థితిలో ఉన్న ఆ కుటుంబానికి యువత బాసటగా నిలిచారు. తలోచేయి వేసి విరాళాలు సేకరించి, రూ.ఐదు వేలు కూడబెట్టారు. ఆ మొత్తాన్ని ఇంటి పెద్ద మరణంతో పుట్టెడు దు:ఖంలో ఉన్న నిరుపేద కుటుంబానికి తమ వంతు సాయంగా అందజేశారు. చేసిందే చిరుసాయమే అయినా, మానవత్వంతో సేవాభావం చూపిన యువకులను స్థానికులు ప్రశంసించి, అభినందించారు. కార్యక్రమంలో కారం కన్నారావు (ప్రజానాట్య మండలి), శేఖర్, బాబుసాయి, కృష్ణుడు, నవీన్, శివ, కిరణ్ విష్ణు ప్రవీణ్, ముతేష్, శంకర్ ఉన్నారు.

దారాలమ్మ ఘాట్‌రోడ్డులో ట్రాఫిక్ జామ్

ధారలమ్మ ఘాట్‌రోడ్డు మధ్యలో ఇరుక్కుపోయిన లారీ

ప్రజాశక్తి-సీలేరు: దారాలమ్మ ప్రధాన రహదారి గుడి కింద ప్రమాద మలుపు వద్ద భారీ వాహనం ప్రధాన రహదారికి అడ్డంగా నిలిచి పోవడంతో సుమారు 4 గంటల పాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. జీకే వీధి మండలం దారాలమ్మ అమ్మవారి ఆలయం ప్రధాన మలుపు వద్ద చింతూరు నుండి పెంటపాడు వద్ద హైవే నిర్మాణానికి మిషన్ తీసుకు వెళ్తూ దారాలమ్మ ఘాట్‌రోడ్డులో ఎదురుగా వస్తున్న ఆటోకు దారిచ్చే క్రమంలో లారీ రహదారికి అడ్డంగా ఇరుక్కు పోయింది. దీంతో ఉదయం 7 గంటల నుండి 11 గంటల వరకు రాకపోకలు స్థంభించాయి. దారకొండ నుండి ట్రాక్టర్‌ను తీసుకెళ్లి, ఇరుక్కుపోయిన వాహనానికి రోడ్డు పక్కకు జరపడం ద్వారా వాహన రాకపోకలకు చర్యలు చేపట్టారు. దీంతో వాహన దారులు ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు .

వీడని వర్షాలతో చిక్కని అదును

- నాట్లు వేసేందుకు మిరప రైతుల ఎదురుచూపులు
- దుక్కులు దున్నేందుకు వీలుకాక అవస్థలు
- గడువు దాటిపోతోందని ఆందోళన

ప్రజాశక్తి-విఆర్.పురం : రోజు విడిచి రోజు వీడకుండా కురుస్తున్న వర్షాలతో పదును చిక్కక మిరప నాట్లు వేయలేకపోతున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఒకవైపు వేసిన మిర్చి నారు ఏపుగా పెరిగిపోతుండగా, మరోవైపు వర్షాల వల్ల పొలాల్లో చేరిన నీరు, తడి వల్ల నాగళ్లు పెట్టి దుక్కిదున్ని, నాట్లు వేసేందుకు పొలాలను సిద్ధం చేసే పరిస్థితి లేకుండా పోతోందని మిర్చి రైతుల వాపోతున్నారు. ఇప్పటికే ఆగస్టు మాసాంతం వచ్చేయడంతో గడువు దాటిపోతోందని కలవరపడుతున్నారు.

విఆర్ పురం మండలంలో అన్ని గ్రామాల్లో అత్యధిక శాతం పొలాల్లో రైతులు మిర్చి పంటను సాగుచేస్తున్నారు. ఇప్పటికే మిర్చినారు వేయగా, మొక్కలు ఏపుగా పెరిగి, నాట్లు వేసేందుకు అపుడే సిద్ధమయ్యాయి. ఏటా గోదావరి వరదల కారణంగా వేసిన మిర్చి పంట ముంపునకు గురై పాడైపోయే పరిస్థితి ఉండగా, ఈ ఏడాది గోదావరి వరద ముంపు భయం ఇప్పటివరకు లేదన్న ఆనందం రైతులకు లేకుండా పోయింది. రోజు విడిచి రోజు వర్షం కురవడంతో భూముల్లో పదును చిక్కక దుక్కులు సాగక మిరపనాట్లు వేయలేకపోతున్నామని, అదును దాటిపోతుందేమోనని రైతులు తల్లడిల్లుతున్నారు.ఏటా ఏదో ఒక విధంగా తాము పంటలకు దూరమౌతున్నామని, అతివృష్టి, అనావృష్టితోపాటు వరదల ముంపు బెడతలో పంటలను నష్టపోతున్నామని వాపోతున్నారు. మండల వ్యాప్తంగా వరి నాట్లు ఇప్పటికే పూర్తి కాగా, మిర్చి వేతల కోసం రైతాంగం ఎదురుచూస్తోంది.

రైతాంగాన్ని అన్ని విధాలా ఆదుకోవాలి

అతివృష్టి, అనావృష్టి, వరదముంపులు ఇలా ఏదో ఒక విధంగా పంటలను నష్టపోతున్న తమను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని మండలంలోని గిరిజన రైతులు కోరుతున్నారు. సాగు ప్రాప్తికి అవసరమైన విత్తనాలు, తర్వాత ఎరువులు వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లు అందజేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

దున్నేందుకు పదును చిక్కని పొలం

నేటి నుంచి క్రీడా పోటీలు

ప్రజాశక్తి-పాడేరు:జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని ఈ నెల 28, 29 తేదీల్లో వివిధ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎ.జగన్మోహనరావు తెలిపారు. ఈ క్రీడా పోటీలు తలారి సింగి గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత పాఠశాల ఆవరణలో జరుగనున్నట్లు ఆయన శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ నెల 28న వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, ఖోఖో, క్రికెట్, 29న హాకీ, చెస్ పోటీలు స్కిప్పింగ్ రోప్, లెమన్ అండ్ స్పూన్, టగ్ ఆఫ్ వార్ పోటీలు జరుగుతాయని చెప్పారు. 29న జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా తలారి సింగి నుండి అంబేద్కర్ సెంటర్ వరకు బాల బాలికలతో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రీడల్లో పాల్గొనే బాలబాలికలు ఫోన్:9000274225 నెంబర్‌కు సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

ఐటిడిఎ పిఒ అభిషేక్‌కు వినతిపత్రం ఇస్తున్న మానవ హక్కుల సంఘం నేతలు

విఆర్‌ఒపై చర్యలకు వినతి

ప్రజాశక్తి-దుంబ్రిగుడ:మండలంలోని అరకు పంచాయతీ కేంద్రంలో ప్రభుత్వ భూములను గిరిజనేతరుల పేరిట మ్యుటేషన్ చేస్తున్న అరకు పంచాయతీ విఆర్‌ఒ పై చర్యలు తీసుకోవాలని కోరుతూ మానవ హక్కుల నేరనిరోధక సంఘం నాయకులు పాడేరు ఐటిడిఎ పిఒ అభిషేక్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర ఏజెన్సీ మహిళా విభాగ అధ్యక్షురాలు కె కృష్ణకుమారి, అల్లూరి జిల్లా అధ్యక్షుడు పి.ధర్మ మాట్లాడుతూ, ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నాయన్నారు. ప్రభుత్వ భూముల్లో గిరిజనేతరులకు విచ్చలవిడిగా మ్యుటేషన్ ఆమోదించిన అధికారిపై విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ రవిశంకర,తదితరులు

మట్టి రోడ్డు పనుల పరిశీలన

ప్రజాశక్తి-పెదబయలురూరల్:మండలంలో పరద పంచాయతీ కర్ర్రాద గ్రామానికి ప్రధాన మంత్రి సడక్ రోడ్డు నుండి గ్రామానికి వెళ్లడానికి ఆదివారం మట్టితో చదును పనులు చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ చెండా రవిశంకర్ మాట్లాడుతూ, గ్రామానికి కనీసం రోడ్ లేక చాలా ఇబ్బందికరంగా గ్రామస్తులు బాధపడుతుంటే జనరల్ ఫండ్ నుండి తాత్కాలికంగా మట్టి రోడ్ ప్రారంభించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కన్వీనర్ పాంగి రవి కుమార్, బాలు చిరంజీవి, కృష్ణారావు పాల్గొన్నారు.

శిథిలావస్థలో పాఠశాల భవనం

శిథిలావస్థలో ఉన్న పాఠశాల వద్ద గ్రామస్తులు

-బిక్కుబిక్కుమంటూ విద్యార్థుల చదువులు
-పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి - అరకులోయ రూరల్:మండలంలోని చిన్నలబుడు పంచాయతీ మాలసింగారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా దర్శనమిస్తుంది. శిథిలావస్థలో ఏ సమయంలో కూలి పోతుందోనని భయంతో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ చదువులు కొనసాగిస్తున్నారు. శిథిలావస్థలో చేరి సుమారు మూడేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ అధికారులు మరమ్మతులు పనులు చేయక పోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ పాఠశాలలో సుమారు 30 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.వర్షాకాలంలో వర్షపు నీరు తరగతి గది లోపలికి కారుతుండటంతో విద్యార్థులు పలు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై పలుమార్లు సంబంధిత ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆ గ్రామస్తులు వాపోతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనం మరమ్మత్తు చేపట్టాలని ఆ గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. మాలసింగారం పాఠశాల భవనాన్ని నిర్మించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం మలసింగారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనాన్ని కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు పి చిన్నస్వామి పరిశీలించారు

విద్యుత్ సౌకర్యం కల్పించాలని గిరిజనుల పాదయాత్ర

ప్రజాశక్తి-అనంతగిరి:అనంతగిరి మండలం రొంపెల్లి, ఎన్ఆర్ పురం పంచాయతీ పరిధిలో కొండ శిఖర 8 గ్రామాల్లో విద్యుత్ సౌకర్యం లేదు. సుమారు1500 మంది గిరి జనాభా నివసిస్తున్నారు. బూరిగ, చిన్నకోనల, బొంగిజ, రాయిపాడు, బెజెంగి వలస, గూడెం, దెబ్బలపాడు, కరకవలస గ్రామాల్లో కొండదొర తెగలకు చెందిన ఆదివాసీ గిరిజనులు జీవనం సాగిస్తున్నారు. విద్యుత్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి బొంగిజ గ్రామం నుంచి కాగడాల చేతబట్టి చిమ్మ చీకట్లో రాయిపాడు, చిన్నకోనల బూరుగు వరకు సుమారు నాలుగు కిలోమీటర్ల వరకు కాలినడకన నడిచి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు మాట్లాడుతూ, భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్ల గడిచినా నేటికీ గిరిజన గ్రామాల్లో విద్యుత్ సౌకర్యం లేక అంధకారంలో చీకట్లోనే మగ్గుతున్నాయని తెలిపారు. ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు, అధికారులు మారినా గిరిజన బతుకులు మాత్రం మారలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకెన్నాళ్లు ఈ చీకటి బతుకులు అని ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్ విద్యుత్ కోత గ్రామాల్లో పర్యటించి జన చేయాలని డిమాండ్ చేశారు.ఆజాదీకా అమృత మహోత్సవాలు పేరుతో భారతదేశం డిజిటల్ ఇండియాగా వెలుగొందుతోందని చెప్పిన్న కేంద్ర ప్రభుత్వం తమ గ్రామాలకు నేటికీ టీవీ చూసే అవకాశం కూడా కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాలకు కరెంట్ సౌకర్యం లేక శుభకార్యాలు, పండగలకు, భోగి మంటలు వేసుకొని ఆ వెలుతురులోనే సంబరాలు చేసుకుంటున్నామన్నారు. ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని చెప్పారు. ఇప్పటికైనా గిరిజన గ్రామాల్లో విద్యుత్ సౌకర్యాలు కల్పించాలని, లేని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రొంపెల్లి పంచాయితీ 10వ వార్డు సభ్యుడు సోముల అప్పలరాజు, ఆదివాసీ గిరిజన సంఘం మండల నాయకులు కోనపర్తి సింహాచలం, బూరుగ పెంటయ్య, బూరుగ సన్యాసిరావు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కాగడాలు పట్టుకొని పాదయాత్ర చేపడుతున్న గిరిజనులు


శిలాఫలకాన్ని పరిశీలిస్తున్న నేతలు

శీలంగొంది కాజ్‌వే పునర్నిర్మించాలి

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండలంలోని పోతంగి పంచాయతీ శీలం గొంది రోడ్డు చంప పట్టి గెడ్డ వద్ద కొట్టుకు పోయిన కాజ్‌వే వెంటనే పునర్నిర్మించాలని స్థానిక కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కే.జగన్నాథం డిమాండ్ చేశారు. కొట్టుకుపోయిన కాజ్వేను కాంగ్రెస్ పార్టీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2014లో తుఫాన్‌కు ఈ కాజ్వే కొట్టుకు పోయిందన్నారు. ఇప్పటికి నిర్మించడంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేస్తుందని విమర్శించారు. ఆధార బాదరగా శిలాఫలకాన్ని ఆవిష్కరించి సుమారు మూడేళ్ల గడుస్తున్నా నిర్మాణం చేపట్ట లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల నాయకులు బి సులోచన, జి.మదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి -మధురవాడ : జాతీయ రహదారిపై శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందినట్లు సిఐ తెలిపారు. ఘటనకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... జివిఎంసి 5వ వార్డు పరిధి కొమ్మాది కూడలి కార్పెంటర్ కాలనీకి చెందిన గారి ప్రసాద్ (28) కారు డ్రైవర్‌గా పని చేస్తూ తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్నాడు. శనివారం కుటుంబ సభ్యులతో కలిసి పెద్దిపాలెం వద్ద ఒక శుభకార్యానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ప్రసాద్ తన ద్విచక్ర వాహనంపై వస్తుండగా కొమ్మాది కూడలి వద్ద మలుపు తిరుగుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో ప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు సోదరుడు శ్రీను ఫిర్యాదు మేరకు హెచ్‌సి శ్రీకాంత్ కేసు నమోదు చేశారు.

కారు, లారీ ఢీ

ప్రజాశక్తి -మధురవాడ : జాతీయ రహదారిపై కార్ షెడ్ కూడలి వద్ద ఆదివారం కారు, లారీ ఢీకొన్నాయి. మధురవాడ నుంచి విశాఖ వైపు వస్తున్న కారును అదే మార్గంలో వస్తున్న లారీ కార్ షెడ్ కూడలి వద్ద ఢీకొట్టింది. దీంతో కారు ఒక్కసారి డివైడర్ పైకి వెళ్లింది. ఎవరికి ఎటువంటి ప్రమాదమూ జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. పక్కనే ఉన్న ట్రాఫిక్ పోలీసులు వెంటనే వచ్చి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

గాయపడిన యువకుడు మృతి

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక బీచ్ రోడ్డు మార్లిన్ కె హోటల్ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు నగరంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం... స్థానిక బోయి వీధికి చెందిన వాడమదుల సతీష్ (27) నగరంలోని ప్రముఖ హోటల్‌లో స్విమ్మింగ్ కోచ్‌గా పనిచేస్తున్నాడు. విధులు ముగించుకుని స్కూటీపై భీమిలి వస్తుండగా రోడ్డుపై తీవ్ర గాయాలతో పడి ఉండటాన్ని గమనించిన అటుగా వెళ్తున్న ఓ వ్యక్తి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యుల సలహా మేరకు ప్రైవేట్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. ఎఎస్ఐ జి.సత్తిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శిల్పారామంలో శాస్త్రీయ, జానపద నృత్యాలు

ప్రజాశక్తి పిఎం.పాలెం : వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా మధురవాడ శిల్పారామంలో నాట్య తరంగిణి డ్యాన్స్ అకాడమీచే శాస్త్రీయ, జానపద నృత్యాల కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మూషికవాహన, వినాయక విగ్నేశ్వర, మహా గణపతిం, కృష్ణ మా ఇంటికి, అదివో అల్లదివో, ఇదిగో భద్రాద్రి, కొలువైతివా, శ్యామల మీనాక్షి, చంద్ర చూడ, దశావతారాలు, జయ గణేశాయ తదితర అంశాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ఎస్.లీలావతి నృత్య దర్శకత్వం వహించగా విష్ణువర్ధన్‌రెడ్డి, శాన్వి, ఇశ్విత, రాణి, చంద్రణి, మాధురి, దేదీప్య, చందు, ఇందు, మేధా, హర్షిణి ప్రియ, భవ్య కళాకారులు నృత్యాలు ప్రదర్శించి సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నారని శిల్పారామం పరిపాలనాధికారి టి.విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు.

పాఠశాలల్లో కుల, మత ప్రస్తావనలు వద్దు

ప్రజాశక్తి-సీతమ్మధార: జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేటు, కార్పొరేటు పాఠశాలలు, వసతి గృహాలు, పునరావాస కేంద్రాల్లో కుల, మత ప్రస్తావనలు తెచ్చే ఉపాధ్యాయులు, సిబ్బందిపై కఠిన చర్యలు చేపట్టేలా రాష్ట్ర ప్రభుత్వానికి, జిల్లా ఉన్నతాధికారులకు సిఫారసు చేయనున్నట్టు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం తెలిపారు. ఇటీవల వైఎస్సార్ జిల్లా బుకాయపల్లిలో అన్యమత ప్రచారంతో పాటు మరిన్ని జిల్లాల స్కూళ్లలో ఉపాధ్యాయులు, సిబ్బందిపై ఆధారాలతో కూడిన ఫిర్యాదులు కోకొల్లలుగా రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌కు అందుతుండడం విచారకరమని పేర్కొన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు నీతి, న్యాయం, నైతిక విలువలు, సేవా తత్పరతను పెంపొందించే విధంగా ఉపాధ్యాయులు, సిబ్బంది తర్ఫీదునివ్వాలి తప్ప మత సంబంధిత అంశాలకు ప్రాధాన్యతనిచ్చి వారి మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

నూతనంగా ఎన్నికైన సభ్యులు వీరే..

విద్యుత్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-సీలేరు: జీకే వీధి మండలం సీలేరులో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) కార్యవర్గం ఎన్నికలు ఆదివారం ఏకగ్రీవంగా జరిగాయి.అధ్యక్షునిగా బి లక్ష్మణరావు. కార్యదర్శిగా టి.విష్ణుకుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎస్ రమణ, వైస్ ప్రెసిడెంట్‌గా కెవిజి. బాపిరాజు, జాయింట్ సెక్రెటరీగా జి లక్ష్మణరావు, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా. ఎస్ కృష్ణారెడ్డి, ప్రచార కార్యదర్శిగా కె.వినోద్ కుమార్, ఆఫీస్ సెక్రటరీగా బి.మేజబు, కోశాధికారిగా వై రాములను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ఎస్ కూర్మారావు, సిహెచ్ పైడిరాజు, సిహెచ్ రాము, సిహెచ్ శ్రీనివాసరావు, కె.సుబ్బారావు, ఎస్‌కె. హబీబుల్లా, ఎస్ దేవి, యు లక్ష్మి, పి సునీత. కే.అక్ష్మి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు బి.లక్ష్మణరావు మాట్లాడుతూ,కాంట్రాక్ట్ కార్మికుల శ్రేయస్సు కోసం నిరంతరం పనిచేస్తానన్నారు. సమస్యలను తన దృష్టికి తెస్తే, పై నాయకులతో సంప్రదించి, వాటి పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు.కార్యక్రమంలో మోతుగూడెం బ్రాంచి, రీజనల్ ఎంప్లాయిస్, డొంకరాయి ఎపి జెన్‌కో ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

రిజర్వాయర్‌లో యువకుడు గల్లంతు

ప్రజాశక్తి-మోతుగూడెం : చింతూరు మండలం, మోతుగూడెం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఫోర్ బై రిజర్వాయర్‌లో ఆదివారం యువకుడు గల్లంతయ్యాడు. స్థానికుల సమాచారం మేరకు రిజర్వాయర్ సందర్శనకు వచ్చిన ఛత్తీస్‌గఢ్ కుంట గ్రామానికి చెందిన జీవేష్ (30),పవర్ కెనాల్ వద్ద సెల్ఫీ వీడియో తీస్తుండగా ప్రమాదవశాత్తు కెనాల్‌లో జారిపడ్డాడు. అందిన సమాచారం మేరకు సంఘటనాస్థలికి చేరుకున్న మోతుగూడెం పోలీసులు, గల్లంతయిన యువకుని ఆచూకి కోసం అన్వేషిస్తున్నారు.

ఒకే రోజు రెండు పల్సర్ బైకుల చోరీ

ప్రజాశక్తి - కొయ్యూరు : మండలంలోని రాజేంద్రపాలెం, మర్రివాడ గ్రామాల్లో శనివారం అర్ధరాత్రి రెండు ద్విచక్ర వాహనాలు చోరీకి గురయ్యాయి. రాజేంద్రపాలెంలో కిరాణా వ్యాపారి మొల్లేటి అంజి తన ఇంటి ఆవరణలో పార్కింగ్ చేసిన పల్సర్ బైక్ తెల్లవారేసరికి కనిపించలేదు. మర్రివాడకు చెందిన మాజీ ఎంపిపి, టిడిపి మండల అధ్యక్షుడు జి.సత్యనారాయణ బైక్ కూడా ఇదే తరహాలో అదృశ్యమైంది. ఈ రెండూ పల్సర్ బైకులే కావడం విశేషం. బాధితులు పోలీసులను ఆశ్రయించారు. అయితే మర్రివాడకు చెందిన మాజీ ఎంపిపి బైకు కొయ్యూరు సమీపంలోని రోడ్డుపై వదిలివెళ్లారు. రాజేంద్రపాలెం కిరాణా వ్యాపారి బైక్ చోరీపై కేసు నమోదు చేస దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజారావు తెలిపారు.

ఆదివాసీ జెఎసి మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి- కొయ్యూరు : ఎపి ఆదివాసీ జెఎసి కొయ్యూరు మండల కమిటీ ఏర్పాటైంది. మండల కమిటీ గౌరవ అధ్యక్షులుగా అరిమెల శ్రీరాములు, కన్వీనర్‌గా సాగిన సంజీవ్, ప్రధాన కార్యదర్శిగా ఉల్లి సూరిబాబు, కోకన్వీనర్లుగా పిల్లా మహేష్, కోడా రమణ, ఉపకార్యదర్శులుగా కొప్పు రమేష్,కొర్రు బాబురావు, మహిళ కార్యదర్శులుగా దిబ్బ కుమారి, గోకెరి భూలక్ష్మి, కోశాధికారిగా బూరుగు వెంకట్రావు, ఉప కోశాధికారిగా మొల్ల బాలరాజు, అధికార ప్రతినిధి లోత పద్మశ్రీను ఇంకా వివిధ విభాగాలకు ప్రతినిధులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా, రాష్ట్ర కమిటీల బాధ్యులు పాల్గొన్నారు.

ఎపిఎల్ 2 విజేత రాయలసీమ కింగ్స్

ప్రజాశక్తి - పిఎం.పాలెం : ఆంధ్రా ప్రీమియర్ లీగ్ (ఎపిఎల్) సీజన్ - 2 విజేతగా రాయలసీమ కింగ్స్ జట్టు నిలిచింది. పిఎం.పాలెం సమీపంలో ఉన్న ఎసిఎ - విడిసిఎ క్రికెట్ స్టేడియంలో ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఆ జట్టు కోస్టల్ రైడర్స్ జట్టును మట్టికరిపించింది. వర్షం కారణంగా ఈ మ్యాచ్‌ను 18 ఓవర్లుకు కుదించారు. తొలుత టాస్ గెలిచిన రాయలసీమ కింగ్స్ ఫీల్డింగ్ ఎంచుకుంది. కోస్టల్ రైడర్స్ జట్టు బ్యాట్స్‌మ్యాన్లు 18 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 155 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రాయలసీమ కింగ్స్ బ్యాట్స్‌మ్యాన్లు 16.3 ఓవర్లులో 5 వికెట్ల నష్టానికి 160 పరుగులు చేసి టైటిల్‌ను సొంతం చేసుకున్నారు. ఓపెనింగ్ బ్యాట్స్‌మ్యాన్లు అంతగా రాణించాకపోయినప్పటికీ మిడిల్ ఆర్డర్‌లో దిగిన బిఎస్.వినయ్ కుమార్ 23 బంతుల్లో 5 సిక్సలు, 4 ఫోర్లుతో 53 పరుగులు చేసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. అదేవిధంగా జిహెచ్.విహారి 29 బంతుల్లో 46 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. వీరిద్దరూ 52 బంతుల్లో 99 పరుగులు చేశారు. చివర్లో దిగిన పి.గిరినాథ్ రెడ్డి 17 బంతుల్లో 29 పరుగులు చేశాడు. విజేత జట్టుకు ముఖ్య అతిథులుగా హాజరైన మాజీ భారత క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్, టిటిడి మాజీ ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి ట్రోఫీ అందజేశారు.

ట్రోఫీతో రాయలసీమ కింగ్స్ జట్టు సభ్యులు

ఎసిఎ పనితీరు అద్భుతం

ఎపిఎల్ యువ క్రికెటర్లకు మంచి వేదిక - మాజీ క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్

ప్రజాశక్తి - పిఎం.పాలెం : ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ పనితీరు అద్భుతంగా ఉందని 1986 ప్రపంచ కప్ హీరో, ఇండియా మాజీ టెస్ట్ కెప్టెన్, బిసిసిఐ మాజీ సీనియర్ సెలక్షన్ కమిటీ చైర్మన్ కృష్ణమాచారి శ్రీకాంత్ ప్రశంసించారు. ఆదివారం డాక్టర్ వైఎస్ఆర్ ఎసిఎ - విడిసిఎ క్రికెట్ స్టేడియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎసిఎ కార్యదర్శి ఎస్ఆర్.గోపీనాథ్ రెడ్డి, అంతర్జాతీయ ప్లేయర్ కెఎస్.భరత్‌తో కలిసి ఆయన మాట్లాడారు. ఆంధ్రలో ప్రతిభ ఉన్న క్రికెటర్లు చాలా మంది ఉన్నారని, అలాంటి వారి ప్రోత్సాహం కోసం ఎపిఎల్ ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. రాబోయే రోజుల్లో ఆంధ్ర నుంచి మరింత మందిని దేశానికి ప్రాతినిధ్యం వహించే క్రికెటర్లను తయారు చేయాలని కోరారు. యువ క్రికెటర్ల ప్రతిభను గుర్తించేందుకు ఎపిఎల్ మంచి వేదికని తెలిపారు. క్రీడాకారుల్లో నైపుణ్యాభివృద్ధి కోసం వైజాగ్ స్టేడియాన్ని ఏంతో అభివృద్ధి చేశారని అభినందించారు. తాను ఇంజినీరింగ్ చదివి క్రికెటర్‌ను అయ్యాయని గుర్తు చేశారు.

ఉపకార వేతనాలు ఇచ్చేస్థాయికి ఎదగాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రస్తుతం స్కాలర్‌షిప్‌లు పొందే ప్రతిభగల విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేసుకొని స్కాలర్‌షిప్‌లు ఇచ్చే స్థాయికి ఎదగాలని కాబోయే రోటరీ గవర్నర్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు ఆకాంక్షించారు. ఆదివారం నగరంలోని ఓ హోటల్‌లో జపాన్‌కు చెందిన ఎల్ -ఏంజెల్ ఇంటర్నేషనల్ వాలంటీర్స్ అసోసియేషన్ వారు రోటరీ క్లబ్ విశాఖ వ్యాలీతో కలిసి 30 మంది ప్రతిభగల పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ దేశ భవిష్యత్తు యువతరం చేతుల్లోనే ఉందన్నారు. రోటరీ విశాఖ వ్యాలీ అధ్యక్షులు పాండురంగరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎల్ -ఏంజెల్ ఇంటర్నేషనల్ వాలంటీర్స్ అసోసియేషన్ కో-ఆర్డినేటర్, పూర్వ రోటరీ ప్రెసిడెంట్ మండ జానకీరామ్, రోటరీ పూర్వ అధ్యక్షులు బాబ్జీ, ధర్మసాయి పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రాజారావు

ప్రజాశక్తి -కొయ్యూరు : వాహనదారులు రహదారి నిబంధనలు పాటించి, రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని ఎస్ఐ రాజారావు సూచించారు. ఆదివారం మండల కేంద్రంలోనూ, రాజేంద్రపాలెం వారపు సంతలోనూ రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. అతివేగం వద్దని, మద్యం తాగి వాహనాలు నడపరాదని సూచించారు. ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని హితవుపలికారు. వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్, ఇతర రికార్డులు కలిగి ఉండాలన్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.కార్యక్రమంలో కొయ్యూరు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రోగిని పరామర్శిస్తున్న జెడ్‌పి ఛైర్‌పర్సన్ సుభద్ర

కెజిహెచ్‌లో జెడ్‌పి ఛైర్‌పర్సన్ ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కెజిహెచ్‌లో జిల్లా ప్రజా పరిషత్ ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర ఆదివారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వార్డులను సందర్శించి రోగులతో మాట్లాడారు. హాస్పటల్‌లో వైద్యుల తీరు, అందిస్తున్న వైద్యంపై ఒక్కొక్కరి దగ్గరకూ వెళ్లి పలు ప్రశ్నలు వేసి ఆరా తీశారు. రోగులకు అందిస్తున్న భోజనం గురించి అడిగి తెలుసుకున్నారు. ఆర్థో విభాగంలోని రోగులతో ఆమె మాట్లాడుతున్న సమయంలోనే టిడిపి ఎస్‌టి సెల్ రాష్ట్ర అధ్యక్షులు సివేరి దొన్నుదొర కూడా ఇటీవల బస్సు ప్రమాదంలో గాయపడ్డ క్షతగాత్రులను పరామర్శించేందుకు అదే విభాగానికి వచ్చారు. ఆ వార్డులో ఇద్దరూ కలిసి రోగులను పరామర్శించారు. ఈ సందర్భంగా సుభద్ర మీడియాతో మాట్లాడుతూ కెజిహెచ్‌లో ప్రస్తుతం రోగులకు అందిస్తున్న సేవలు సంతృప్తికరంగా ఉన్నాయన్నారు. తాను జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో కెజిహెచ్ గురించి ముక్తకంఠంతో జెడ్‌పిటిసిలు, ఎమ్మెల్యేలు ధ్వజమెత్తిన సందర్భాలు చూశానని, ఆ తర్వాత వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని, కలెక్టర్ మల్లికార్జున సహకారంతో కెజిహెచ్‌లో అనేక మార్పులు తీసుకొచ్చామని తెలిపారు. ఎస్‌టి సెల్‌ను పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేశామన్నారు.

వంద పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయండి

ప్రజాశక్తి- చింతూరు: చింతూరు ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకలతో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా అభివృద్ధి చేసి, గిరిజనులకు మెరుగైన వైద్యం అందించాలని బిజెపి జిల్లా ప్రధానకార్యదర్శి పాయం వెంకయ్య, మండల అధ్యక్షులు డివిఎస్ఎన్ రమణారెడ్డి కోరారు.ఆసుపత్రిలో పనిచేస్తున్న డాక్టర్లకు నివాస భవనాలను నిర్మించాలని, ఆసుపత్రి చుట్టూ ప్రహరీ నిర్మించాలని కోరారు. ప్రస్తుతం ఆసుపత్రిలో రోగులకు మంచి సేవలే అందుతున్నాయన్నారు. రోగులకు అదనంగా వార్డులను నిర్మించాలని కోరారు. చింతూరుతోపాటు కూనవరం, విఆర్.పురంలలో డాక్టర్ల నివాసాలకు శాశ్వత భవనాలను నిర్మించాలని కోరారు.

29న గిడుగు రామ్మూర్తి జయంతి సభ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : తెలుగు వాడుక భాషోద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి జయంతి సభను మంగళవారం సాయంత్రం 5 గంటలకు అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు అల్లూరి విజ్ఞాన కేంద్రం కార్యక్రమాల ఇన్‌ఛార్జి జిఎస్.రాజేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అల్లూరి విజ్ఞాన కేంద్రం, సాహితీ స్రవంతి, అరసం సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు భాషా మాధుర్యంపై ఈ సభ నిర్వహిస్తున్నామన్నారు. తెలుగు భాషా కోవిదులు మీగడ రామలింగస్వామి, మేడా మస్తాన్ రెడ్డి, కెజి.వేణు, అడపా రామకృష్ణ, అయ్యగారి సీతారత్నం, క్షేత్రపాల్ రెడ్డి, వేల్పురి నాగు, కెఎస్‌వి.రమణమ్మ, శేఖర్ మంత్రి ప్రభాకర్, డాక్టర్ ఎం.సుబ్బారావు, డాక్టర్ కెవిఎస్.మూర్తి, జాలాది విజయ, ఎంవిఎస్.శర్మ, ధవళ రవికుమార్ పాల్గొంటారన్నారు.

జిసిసి డ్రైవర్లకు జీతాల పెంపు

ప్రజాశక్తి - కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ

గిరిజన సహకార సంస్థ (జిసిసి) ద్వారా రేషన్, నిత్యావసర సరుకులను గిరిజనులకు పంపిణీ చేస్తున్న డ్రైవర్ల జీతాలను పెంచినట్టు జిసిసి ఛైర్‌పర్సన్ స్వాతిరాణి మీడియాకు తెలిపారు. 20 ఏళ్లుగా పనిచేస్తున్న తమకు కనీస వేతనాలు ఇవ్వాలని డ్రైవర్లు చాలా కాలంగా విజ్ఞప్తి చేస్తున్నారన్నారు. వారి సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళ్లగా జీతాల పెంపుదలకు ఆయన ఆమోదం తెలిపారన్నారు. ఇప్పటి వరకూ రూ.15 వేలు తీసుకుంటున్న వారికి రూ.20,800 అందేలా చర్యలు తీసుకొని, 55 మంది డ్రైవర్ల కుటుంబాలకు న్యాయం చేశామన్నారు.